సాక్షి
అన్నమయ్య జిల్లా
సోమవారం । 14 । అక్టోబర్ । 2024



ఉసురు తీసిన ఆన్‌లైన్ బెట్టింగ్

ఆన్‌లైన్ బెట్టింగ్ ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ప్రాణాలను బలిగొంది. ఈ సంఘటన శనివారం మదనపల్లె మండలం సీటీఎం రైల్వేస్టేషన్ వద్ద వెలుగు చూసింది. -8లో



అన్నదాతలకు బాబు వెన్నుపోటు

అన్నదాతలకు చంద్రబాబు వెన్నుపోటు పొడిచాడని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి విమర్శించారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటి రకం	రూ.600	రూ.720
రెండో రకం	రూ.440	రూ.580

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 90 మెట్రిక్ టన్నులు





తొట్టి మెరవణిలో వాసవీ కన్యకాపరమేశ్వరి దివ్య రూపం



శమీదర్శనానికి తరలిన అమ్మవారు

మురిసిన పసిడిపురి

నింగిలోని తారలన్నీ నేలదిగినట్లు.. నలుదిక్కులా వెలుగు జిలుగులతో..... జన సముద్రమే వాలిపోయిందన్నట్లు.. పోటెత్తిన జన కెరటాలతో.. పసిడిపురి హోరెత్తిపోయింది. మహిషాసురుడిని దునుమాడి వధించిన దుర్గా దేవి దివ్య స్వరూపాన్ని చూసి.. భక్తజనం మురిసిపోయింది. విజయదశమిని పురస్కరించుకుని శనివారం సాయంత్రం శమీ దర్శనం.. అనంతరం రాత్రి తొట్టి మెరవణి కనులపండువగా సాగింది. 'శక్తి'గా మారిన విజయదుర్గ భక్తులను కరుణిస్తూ ఊరేగారు.

- కన్నులపండువగా వాసవాంబ తొట్టిమెరవణి
- భక్తులతో జనసంద్రమైన కొర్రపాడు రోడ్డు
- వైభవంగా శమీదర్శన మహోత్సవం

ప్రొద్దుటూరు కల్చరల్: దసరా ఉత్సవాలతో పసిడిపురి ప్రొద్దుటూరు మురిసిపోయింది. దేవీశరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా రోజూ ఓ అలంకరణలో అగుపించే అమ్మవారిని దర్శించడం ఒక ఎత్తైతే అన్ని ఆలయాల అమ్మవార్లను ఒకే చోట విజయదశమి నాడు శమీదర్శనంలో దర్శించడం మరింత ప్రత్యేకత. విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రొద్దుటూరులో శనివారం సాయంత్రం శమీదర్శన మహోత్సవం వైభవంగా సాగింది. వాసవీమాత ఉత్సవ మూర్తిని పూలతో, పుత్తడి ఆభరణాలతో అలంకరించి ఊరేగింపుగా తీసుకొచ్చి కొర్రపాడు రోడ్డులోని వాసవీ శమీవృక్ష మండపంలో శమీదర్శనం చేయించారు. కేరళ సింగారి మేళం, డీజే, బాణసంచా పేలుళ్లు, సినీ డూప్స్, పాల కొల్లు బ్యాండ్, విద్యుత్ ఆర్చీల వెలుగులు, మంగళవాద్యాల సందడి శమీదర్శనానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. డ్రోన్ ద్వారా పూలు చల్లడం శోభాయమానంగా నిలిచింది. భక్తులు అమ్మవారి పాదాల చెంత శమీ వృక్ష పత్రాలను వేసి సర్వశుభాలు అనుగ్రహించాలని వేడుకున్నారు. శమీదర్శన వేడుకలను తిలకించడానికి వచ్చిన భక్తులతో సర్కిళ్లు కిటకిటలాడాయి.



శక్తి వేషధారణ

వాసవీమాత తొట్టి మెరవని

శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో దేవీశరన్నవరాత్రి వేడుకల ముగింపు సందర్భంగా శనివారం అర్ధరాత్రి విజయలక్ష్మీదేవి అలంకారంలో అమ్మవారు గ్రామోత్సవం (తొట్టిమెరవణి) కన్నుల పండువగా నిర్వహించారు. అమ్మవారి ఉత్సవమూర్తిని గజమాలలతో, ఆభరణాలతో అలంకరించి శ్రీచక్రం ఉన్న పంచలోహ హంస వాహన రథంపై ఆశీనులను చేసి పురవీధులలో వాసవీ నామస్మరణ మధ్య అట్టహాసంగా ఊరేగించారు. ఈ వేడుకలో కేరళ సింగారిమేళం, శక్తి వేషాలు, హర్యాణా వారి భంభం భోలే వేషాలు భక్తులకు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ రథం పురవీధుల్లో తిరగడం వల్ల అశుభాలు తొలగిపోయి మంచి జరుగుతుందన్ని భక్తుల విశ్వాసం. అమ్మవారిశాల నుంచి ప్రారంభమైన తొట్టిమెరవని బంగారు అంగళ్ల వీధి, పప్పుల బజార్‌ల మీదుగా పుట్టపర్తి సర్కిల్‌కు చేరుకుంది.రకరకాల బాణసంచా పేలుళ్లు, చెట్లు, రాకెట్లు, పాములు వంటి వాటిని పేల్చి విజయదశమి వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు. అమ్మవారిని దర్శించేందుకు వచ్చిన భక్తులతో పురవీధులు కిటకిటలాడాయి. ఆర్య వైశ్యసభ అధ్యక్షుడు బుశెట్టి రాంమోహన్‌రావు, ఉపాధ్యక్షుడు రవీంద్ర బాబు, కార్యదర్శి మురికి నాగేశ్వరరావు, ఆర్యవైశ్య సభ ప్రముఖులు, సభ్యులు పాల్గొన్నారు.



ఆకట్టుకున్న బాణసంచా పేలుళ్లు



తొట్టి మెరవణి సందర్భంగా జనసంద్రమైన శివాలయం సర్కిల్



రాయచోటి : వీరభద్రస్వామి ఆలయంలో భద్రకాళి అమ్మవారి దర్శనం

అంబరాన్నంటిన సంబరాలు

రాయచోటి: అన్నమయ్య జిల్లాలో విజయదశమి సంబరాలు అంబరాన్నంటాయి. రాయచోటి, రాజంపేట, మదనపల్లి, పీలేరు, రైల్వేకోడూరు, బి.కొత్తకోట, తంబళ్లపల్లితోపాటు ప్రతి మండల కేంద్రం, గ్రామాలలోని కన్యకా పరమేశ్వరీ ఆలయాలలో అమ్మవారు నిజరూపంలో దర్శనమిచ్చారు. మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి రాయచోటిలోని పలు ఆలయాలలో అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో జమ్మిచెట్టుకు శాస్త్రోక్తంగా చేసిన పూజలలో మంత్రి పాల్గొన్నారు. రాజంపేటలో ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథరెడ్డి, కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, పీలేరు ఎమ్మెల్యే కిషోర్‌కుమార్‌రెడ్డి, మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్ బాషా ఆయా నియోజకవర్గాలలో జరిగిన అమ్మవారి పూజల్లో పాల్గొన్నారు. సాయంత్రం వేళలో అమ్మవారి ఊరేగింపు వేడుకల్లో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పుష్ప పల్లకీలో ఊరేగింపు

రాయచోటిలోని ఎస్‌ఎన్ కాలనీ శ్రీ ఉమామహేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారిని పుష్పపల్లకీలో పుర వీధులలో ఊరేగింపు చేశారు. రాయచోటి పట్టణంలోని కొత్తపేటలో ఏర్పాటు చేసిన విజయ దుర్గాదేవి ప్రతిమకు తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజలు చేశారు. అదే విధంగా చౌడేశ్వరీదేవి, పాత రాయచోటి శివాలయం, మాసాపేటలోని శ్రీ మహేశ్వరీ మల్లాలమ్మ తల్లి దేవస్థానం తదితర ప్రాంతాలలో నవరాత్రి ఉత్సవాలను వేడుకగా నిర్వహించారు.



రాజంపేట టౌన్ : కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఊరేగింపు

న్యూస్‌రీల్

ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

రాయచోటి: జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయన్న సమాచారంతో సోమవారం నిర్వహించనున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి ఫిర్యాదులను సమర్పించేందుకు కలెక్టరేట్‌కు రావద్దని ఆయన పేర్కొన్నారు.

బాధ్యతల స్వీకరణ



ఈఓ శ్రీనివాసులు

లక్కిరెడ్డిపల్లి: మండలంలోని శ్రీ అనంతపురం గంగమ్మ ఆలయ ఈఓగా శ్రీనివాసులు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న మారుతీ ప్రసాద్ అల్లాడుపల్లె దేవాలయానికి బదిలీపై వెళ్లడంతో.. అల్లాడుపల్లి దేవాలయ ఈఓగా పని చేస్తున్న కె.శ్రీనివాసులును ఇక్కడికి బదిలీ చేశారు.

భక్తిశ్రద్ధలతో ఆయుధపూజ




ఎస్పీ కార్యాలయంలో ఆయుధ పూజలో జిల్లా పోలీస్ యంత్రాంగం

రాయచోటి: విజయదశమిని పురస్కరించుకొని అన్నమయ్య జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో శనివారం భక్తిశ్రద్ధలతో ఆయుధపూజ కార్యక్రమం నిర్వహించారు. ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు పోలీసు ఆయుధాగారం, పోలీసు వాహనాల విభాగాలలో దుర్గామాత చిత్రపటం, ప్రతిమలకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పట్టణ డీఎస్పీ కృష్ణమోహన్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, ఏఆర్‌ఎస్‌ఐలు, స్థానిక పోలీసులు, ఏఆర్ సిబ్బంది, స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు.

లక్కీబాబులు ఎవరో!

- మద్యం షాపుల నిర్వహణ కోసం నేడే లాటరీ ప్రక్రియ
- 111 షాపులకు 2160 దరఖాస్తులు
- పకడ్బందీగా ఏర్పాట్లు : ఈఎస్



రాయచోటి: మద్యం వ్యాపారుల అదృష్ట పరీక్షకు సర్వం సిద్ధమైంది. సోమవారం ఉదయం 8 గంటల నుంచి కలెక్టర్ సమక్షంలో మద్యం షాపుల నిర్వహణ లైసెన్సు కోసం లాటరీ ప్రక్రియ కొనసాగనుంది. అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో లక్కీడ్రా కార్యక్రమాన్ని ఎక్సైజ్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఇందుకోసం చేస్తున్న ఏర్పాట్లను జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూధన్‌రావు, అసిస్టెంట్ ఈఎస్ గజేంద్ర దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. ప్రభుత్వం ఈ నెల 11వ తేదీ నాటికి టెండర్ల దరఖాస్తుల స్వీకరణ పూర్తి చేసింది. శుక్రవారం చివరి నాటికి 111 షాపులకు గాను 2160 దరఖాస్తులు దాఖలు అయ్యాయి. 30 మండలాలు, మూడు మున్సిపాలిటీల పరిధిలో 111 మద్యం షాపులకు 2160 దరఖాస్తులు దాఖలు అయినట్లు జిల్లా ఎక్సైజ్ ఎస్‌ఈ మదుసూధన్‌రావు తెలిపారు. వీటి ద్వారా ప్రభుత్వానికి రూ.43 కోట్ల 20 లక్షల ఆదాయం చేకూరింది.

కలెక్టర్ చేతుల మీదుగా లక్కీ డ్రా

రాయచోటిలోని మదనపల్లి మార్గం అజయ్ కన్వెన్షన్ సెంటర్‌లో సోమవారం ఉదయం కలెక్టర్ చేతుల మీదుగా లక్కీడ్రా తీయనున్నారు. ఉదయం 8 గంటలకు తొలి డ్రా ఫలితం వెలువడేలా చర్యలు చేపట్టామని ఈఎస్ తెలిపారు. ఫలితం వెలువడిన వెంటనే వారికి షాపు కేటాయింపు ఉత్తర్వులు ఇవ్వడం జరుగుతుందన్నారు. షాపు దక్కించుకున్న వారు వెంటనే ప్రభుత్వ నిబంధనల ప్రకారం 25 శాతం డబ్బులను బ్యాంకులో చెల్లించి రసీదు అందజేయాలని సూచించారు.

వీరబల్లిలో తీవ్ర పోటీ

అన్నమయ్య జిల్లాలో 10వ మద్యం షాపు (వీరబల్లి) నిర్వహణ కోసం అత్యధిక పోటీ నెలకొంది. 57 మంది మద్యం వ్యాపారులు పోటీ పడ్డారు. తర్వాత స్థానంలో బి.కొత్తకోట నిలుస్తోంది. అక్కడి 77వ షాపు కోసం 45 మంది పోటీ పడ్డారు. అన్నమయ్య జిల్లాలో 111 మద్యం షాపుల కోసం 2,160 మంది దరఖాస్తులు చేసుకోగా, 7మద్యం షాపులకు మాత్రమే సింగిల్ డిజిట్ దరఖాస్తులు దాఖలయ్యాయి.

ధ్రువపత్రాలతో రావాలి

షాపుల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఆధార్ కార్డు, లేదా తత్సమానమైన గుర్తింపు కార్డు, దరఖాస్తు ధ్రువపత్రాలతో హాజరు కావాలని ఈఎస్ చెప్పారు. 1 నుంచి 60 షాపు నంబరు వరకు ఒక వైపు, 61 నుంచి 111 షాపు వరకు రెండవ భాగంలో డ్రా తీసేలా ఏర్పాట్లు చేశామన్నారు. టెండర్ల నిర్వహణలో అందరూ సహకరించాలని కోరారు.

కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు

మద్యం షాపుల లక్కీ డ్రా కార్యక్రమం సందర్భంగా రాయచోటి పట్టణం మదనల్లి మార్గంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు అర్బన్ సీఐ చంద్రశేఖర్ తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చే దరఖాస్తుదారులు ప్రశాంతంగా నిర్వహించేలా సహకరించాలన్నారు. బెంగళూరు మదనపల్లె వైపు నుంచి పట్టణంలోకి వచ్చే భారీ వాహనాలను మరో మార్గం ద్వారా దారి మళ్లించనున్నట్లు సీఐ చెప్పారు.

16న కొత్త షాపులు ప్రారంభం

దరఖాస్తుల స్వీకరణ పూర్తి కావడంతో.. లాటరీ ప్రక్రియకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. లాటరీలో షాపులు దక్కించుకున్న వారు 16న కొత్త షాపులు ప్రారంభించాల్సి ఉంటుంది. అయితే దరఖాస్తులు చేసుకున్న వారు ముందస్తుగా షాపులు మాట్లాడుకున్నారు. ఇలా ఖరారు అయిన మరుక్షణం రంగంలోకి దిగనున్నారు. అటు మద్యం సరఫరా సంస్థల నుంచి సైతం.. మద్యాన్ని వీలైనంత వరకు షాపులకు తొలి రోజే చేర్చాలని ఎక్సైజ్ శాఖ ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకుంది. కాగా షాపులు దక్కించుకున్న వారు నిర్దేశిత మొత్తాన్ని ఆరు వాయిదాలలో చెల్లించుకోవచ్చు. అయితే షాపులు ప్రారంభానికి ముందే తొలి వాయిదా చెల్లించాల్సి ఉంటుంది.

నియోజకవర్గాల వారీగా..

నియోజకవర్గం	షాపులు	దరఖాస్తులు
రాయచోటి	16	422
లక్కిరెడ్డిపల్లె	7	150
రాజంపేట	20	253
రైల్వేకోడూరు	19	224
మదనపల్లి	22	649
ములకలచెరువు	9	199
వాయిల్పాడు	9	78
పీలేరు	9	136



లక్కీ డ్రా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న అన్నమయ్య జిల్లా ఈఎస్ మధుసూధన్‌రావు

వీడని ఉత్కంఠ

- హార్సిలీహిల్స్ ప్రవేశ రుసుం వేలంపై తొలగని సందిగ్ధత
- పాత పాటదారుడికే అప్పగిస్తారా.. మళ్లీ వేలం వేస్తారా?
- పక్కా నిబంధనలు రూపొందించకుంటే ఇలాంటి పరిస్థితులే

బి.కొత్తకోట: బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్ వచ్చే సందర్శకుల నుంచి వసూలు చేసే టోల్‌ఫీజు వేలంపాట దక్కించున్న వ్యక్తికే.. కట్టబెట్టేందుకు హార్సిలీహిల్స్ టౌన్‌షిప్ కమిటీ చైర్మన్ అయిన మదనపల్లె సబ్ కలెక్టర్ చర్యలు తీసుకుంటారా లేక మళ్లీ వేలం నిర్వహిస్తారా అనే అంశంపై ఉత్కంఠ నెలకొంది. గత నెల 30న నిర్వహించిన వేలం పాటల్లో 2024–25 ఏడాదికి లీజును మదనపల్లెకు చెందిన వ్యక్తి రూ.45.20 లక్షలకు పాడి దక్కించుకున్నారు. సబ్‌కలెక్టర్ ప్రొసిడింగ్స్ లేకుండా, 50 శాతం నగదు జమ చేయకుండా టోల్ ఫీజు వసూలు టోకెన్లు ముద్రించుకోవడం, దాన్ని రెవెన్యూ అధికారులు అడ్డుకోవడం, తనకు లీజు వద్దంటూ పాటదారుడు తప్పుకోవడం జరిగిపోయాయి. ఈ నేపథ్యంలో లీజు అప్పగింత వ్యవహారం మళ్లీ మొదటికొచ్చింది.



హార్సిలీహిల్స్ టోల్ ఫీజు వసూలు చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

రూ.2 వేలు కడితే సరిపోతుందా..!

ప్రవేశ రుసుం వసూలుకు సంబంధించిన విషయం చర్చనీయాంశమైంది. సాధారణంగా గ్రామ పంచాయతీల్లో గుత్తలకు వేలంపాటలు నిర్వహిస్తే సాల్వేన్సీలు, లక్షల డిపాజిట్లు కట్టించుకున్నాకే వేలం పాటలో పాల్గొనేందుకు అవకాశం ఇస్తారు. అయితే లక్షలు పలుకుతున్న హార్సిలీహిల్స్ ఎంట్రీ ఫీజు వసూలు గుత్తకు మాత్రం ఎలాంటి నిబంధనలు లేకుండా కేవలం రూ.2 వేలు చెల్లించి పాటలో పాల్గొనే అవకాశం కల్పిస్తున్నారు. దీనితో పాట పాడిన వ్యక్తి నిజంగా గుత్త కోసం పాల్గొన్నాడా లేక మొక్కుబడి కోసం వచ్చాడా అన్నది తెలియదు. దీనితో రూ.2 వేలు చెల్లించినా తిరిగి వస్తుందని అందరూ పాల్గొంటున్నారు. ఈ విధానానికి స్వస్తి పలకాల్సిన అవసరం ఏర్పడింది. గత నెల 30న నిర్వహించిన వేలం పాటలో 17 మంది పాల్గొంటే అందరూ రూ.2 వేలు చెల్లించి పాల్గొన్నారు. గతేడాది లీజు రూ.28 లక్షలు పలికింది. లక్షల్లో పలికే వేలంపాటలో పాల్గొనే వ్యక్తి కనీసం రూ.లక్ష డిపాటిట్ కట్టించుకుంటే పాట దక్కించుకున్న వారి నుంచి ఈ డిపాజిట్ కలిపి 50 శాతం నగదు జమ చేసుకోవచ్చు. పాట దక్కించుకుని వద్దంటే దానిపై ప్రత్యేక చర్యలు తీసుకునేలా కఠిన నిబంధనలు అమలు చేసేందుకు తీసుకుంటే నిజమైన పాటదారులే పాల్గొనే అవకాశం ఉంటుంది. దీనివల్ల ఇబ్బందులు తలెత్తవు. కేవలం రూ.2 వేలు చెల్లించి పాటకు అనుమతి ఇస్తే అవగాహన లేని వ్యక్తులు కూడా పాల్గొంటే ఇబ్బందులకు ఆస్కారం కలుగుతుంది. లేదంటే ఇలాంటి పరిస్థితులే పునరావృత్తం అవుతాయి.

మళ్లీ వేలం పాటలు

ఎంట్రీఫీజు వసూలుకు మళ్లీ వేలంపాటలు నిర్వహిస్తారా లేక గతనెల 30న జరిగిన వేలంపాటలో పాల్గొన్న రెండు లేక మూడవ అత్యధిక పాటదారునికి లీజు అప్పగిస్తారా అన్నది సబ్‌కలెక్టర్ నిర్ణయించాల్సి ఉంది. లేనిపక్షంలో తిరిగి వేలం వేయడం మినహా మరో మార్గం లేదని అధికారులు చెబుతున్నారు. అయితే లీజు వద్దనుకున్న వ్యక్తి పాడినట్టు రూ.45.20 లక్షలు పలికినట్టుగా పాట పలకకపోవచ్చు. గత పాటలో పాల్గొన్నట్టు 17 మంది హాజరుకాకపోవచ్చు. లీజుపై అవగాహన కలిగిన వ్యక్తులు గత రెండు సంవత్సరాల లీజు బేరిజు వేసుకుని అంతకు 10 నుంచి 20 శాతం మేరకు అదనంగా పాట పాడే పరిస్థితులు కనిపిస్తున్నాయి. రెండోసారి వేలంపాటలు నిర్వహిస్తే పక్కాగా నిబంధనలు పాటించేలా అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

క్లుప్తంగా

క్వారీ కార్మికుడి మృతి

మదనపల్లె సిటీ : మదనపల్లె మండలం వలసపల్లెలోని క్వారీలో తమిళనాడు రాష్ట్రానికి చెందిన కార్మికుడు అనారోగ్యంతో మృతి చెందాడు. తాలూకా సీఐ కళా వెంకటరమణ కథనం మేరకు... తమిళనాడు రాష్ట్రం క్రిష్ణగిరి సమీపంలోని అర్కార్టుకు చెందిన శేషాద్రి (50) రెండేళ్లుగా క్వారీలో పని చేస్తున్నాడు. రాత్రి అనారోగ్యానికి గురి కావడంతో మృతి చెందాడు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కటుంబ సభ్యులకు అప్పగించారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి..


మృతి చెందిన కొత్తూరు నరసింహులు

చిట్వేలి : మండల పరిధిలోని వెంకటరాజుపల్లి అరుంధతివాడకు చెందిన కొత్తూరు నరసింహులు(54) శుక్రవారం ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. తన ఇంటిలోని టీవీ పనిచేయకపోవడంతో ఒకచోటి నుండి ఇంకో చోటికి మారుస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. తొలుత బంధువులు 108 సిబ్బందికి సమాచారం అందించగా వారు వచ్చి పరిశీలించి మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు..


అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన రెడ్డిశేఖర్

రామసముద్రం : రామసముద్రం మండలం నారిగానిపల్లె సమీపంలోని అటవీ ప్రాంతంలో అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి చెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు చెంబకూరు పంచాయతీ కాటీవారిపల్లెకు చెందిన రామచంద్ర కుమారుడు రెడ్డిశేఖర్(25) ఆదివారం ఉదయం నారిగానిపల్లె సమీపంలోని అటవీ ప్రాంతంలో శవమై కనిపించాడు. విషయాన్ని స్థానికులకు పోలీసులు సమాచారం అందించారు. వెంటనే మదనపల్లె సీఐ రమేష్, ఎస్ఐ వెంకటసుబ్బయ్య సంఘటన స్థలానికి చేరుకుని స్థానికులను విచారించారు. అనంతరం శవ పరీక్ష కోసం మృతదేహాన్ని పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ మెడలోని గొలుసు లాక్కెళ్లిన దుండగులు

మైదుకూరు : మైదుకూరు పరిధిలోని లింగాలదిన్నెకు చెందిన భూమిరెడ్డి వెంకటరాధ అనే మహిళ శనివారం సాయంత్రం మైదుకూరులో దసరా ఉత్సవాలను తిలకించేందుకు వచ్చింది. అమ్మవారి దర్శనం చేసుకుని స్థానిక నంద్యాల రోడ్డులో నిలుచుని ఉండగా మోటార్ బైక్‌పై వచ్చిన ఇద్దరు అగంతకులు ఆమె మెడలోని బంగారు గొలుసును లాక్కెళ్లారు.

ఉసురు తీసిన ఆన్‌లైన్ బెట్టింగ్

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ బలవన్మరణం


పద్మనాభరెడ్డి (ఫైల్)


మృతదేహం వద్ద విలపిస్తున్న తల్లి, నాన్నమ్మ

తంబళ్లపల్లె : ఆన్‌లైన్ బెట్టింగ్ ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ప్రాణాలను బలిగొంది. తల్లిదండ్రులకు తీరని కడుపుకోత మిగిల్చింది. ఈ విషాదకర సంఘటన శనివారం మదనపల్లె మండలం సీటీఎం రైల్వేస్టేషన్ వద్ద వెలుగు చూసింది. 'ఆన్‌లైన్ బెట్టింగ్‌లతో నేను లక్షల రూపాయలు పోగొట్టుకున్నాను.. నా లాగా ఎవరూ ఆన్‌లైన్ బెట్టింగ్‌ల జోలికి పోవద్దు. తల్లిదండ్రులకు శోకం మిగల్చవద్దు.. నా మరణానికి ఎవరూ బాధ్యులు కారు'..అంటూ సూసైడ్ నోట్ రాసి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు, కుటుంబీకుల కథనం మేరకు వివరాలు.. తంబళ్లపల్లె మండలం ఎద్దులవారిపల్లె పంచాయతీ దిగువగాలిగుట్టపల్లెకు చెందిన నడిమింటి వెంకటరమణారెడ్డి సామాన్య రైతు. అష్టకష్టాలు పడి రెండవ కుమారుడు పద్మానాభరెడ్డిని ఉన్నత చదువులు చదివించాడు. బెంగళూరులోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగంలో చేరాడు. మూడేళ్లుగా నెలకు సుమారు రూ.60 వేల వేతనంతో ఉద్యోగం చేశాడు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాటు పడి సుమారు రూ.24 లక్షలు అప్పులు చేశాడు. ఒక వైపు ఉద్యోగ ఒత్తిడి, మరో వైపు అప్పుల బాధ, వీడని బెట్టింగ్ వ్యామోహంతో మానసిక ఒత్తిడికి లోనయ్యాడు. ఆత్మహత్యకు పాల్పడేందుకు నిశ్చయించుకున్నాడు. బెంగళూరు నుంచి సీటీఎం(చిన్న తిప్పసముద్రం) రైల్వేస్టేషన్‌కు చేరుకున్నాడు. శుక్రవారం రాత్రి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే డ్రైవర్ గుర్తించి కదిరి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు.రైల్వేపోలీసులు శనివారం తెల్లవారుజామున సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతుని సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్, కంపెనీ ఐడీ కార్డు, ఆధార్ కార్డులను గుర్తించి మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. తల్లిదండ్రులు సంఘటన స్థలం చేరుకుని కుమారుడి మృతదేహం చూసి తల్లడిల్లిపోయారు. మృతుని జేబులోని సూసైడ్ నోట్‌ను పరిశీలించగా ఆత్మహత్యకు గల కారణం ఆన్‌లైన్ బెట్టింగ్ అని నిర్ధారించుకున్నారు.

మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీలకు అప్పగించారు. శనివారం సాయంత్రం స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి మృతదేహాన్ని సందర్శించి మృతుని కుటుంబీకులను ఓదార్చారు.

అన్నదాతలకు చంద్రబాబు వెన్నుపోటు

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి


గడికోట శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి అర్బన్ : అన్నదాతలకు చంద్రబాబు వెన్నుపోటు పొడిచాడని, ఖరీఫ్ కాలం ముగుస్తున్నా రైతులకు పెట్టుబడి సాయం ఏమాత్రం అందకపోవడం దారుణమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకంలో భాగంగా రైతులకు పెట్టుబడి సాయంగా ఏడాదికి రూ. 20వేలు అందజేస్తామంటూ ఎన్నికల సమయంలో ఊదరగొట్టిన చంద్రబాబు సీఎంగా బాధ్యతలు చేపట్టాక ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. దీంతో పెట్టుబడుల కోసం రైతులు అధిక వడ్డీలకు అప్పులు చేయక తప్పడం లేదన్నారు. ఇప్పటికే పీఎం సమ్మాన్ కింద కేంద్ర ప్రభుత్వం రెండు విడతలుగా రూ.4వేలు ఆర్థికసాయం విడుదల చేయగా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తామన్న సాయం కోసం రైతులు కళ్లు కాయలు కాసేలా ఎదురు చూస్తున్నారన్నారు. అలాగే లీటరు పాలధర రూ. 10 తగ్గడంతో పాడిరైతులు విలవిల్లాడుతున్నారన్నారు. గత 4 మాసాల కాలంలో నిత్యావసర సరుకుల ధరలు రెట్టింపయ్యాయని విమర్శించారు. వైఎస్ జగన్ హయాంలో ఐదేళ్లలో రాయచోటి నియోజకవర్గ రైతులు రూ.274 కోట్లు లబ్ధి పొందారని తెలిపారు. 2020–21 సంవత్సరాల్లో తుపాను ప్రభావంతో నష్టపోయిన పంటలకు రూ. 50 కోట్లు పరిహారం అందిందన్నారు. 2023లో కరువు కారణంగా 14,853 ఎకరాలలో ఖరీఫ్ పంటలు దెబ్బతినగా 10,454 మంది రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ కింద 10 కోట్లు లబ్ధి చేకూరిందన్నారు. వైఎస్ఆర్ సున్నా వడ్డీ పంట రుణాల లబ్ధి రూ.6,31,11,066 కాగా, వైఎస్ఆర్ ఉచిత పంటల బీమా ద్వారా పంట నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ అందించి రైతుకు వెన్నుదన్నుగా నిలిచింది అప్పటి జగనన్న ప్రభుత్వమేనని శ్రీకాంత్‌రెడ్డి వివరించారు.

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి డిమాండ్

రాయచోటి అర్బన్ : రాష్ట్ర వ్యాప్తంగా నెలకొన్న పెన్షనర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని పెన్షనర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈశ్వరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక డైట్ సభా భవనంలో జిల్లా స్థాయి పెన్షనర్ల సంఘం సర్వసభ్య సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ పెన్షనర్లు అందరికీ ఆయుష్మాన్ భారత్ కార్డులను జారీచేసి రూ. 5లక్షల వరకు నగదు రహిత చికిత్స పొందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అడిషనల్ క్వాంటం పెన్షన్‌ను పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు బి.వి.రమణ, సంఘం నేతలు రెడ్డెన్న, వాకా రెడ్డికుమార్‌తో పాటు పలువురు పెన్షనర్లు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి


మృతురాలు గీత

ములకలచెరువు : మండలానికి చెందిన ఒక వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. మండలంలోని వేపూరికోట పంచాయతీ కుటాగోళ్లపల్లెకు చెందిన ప్రకాష్‌కు పెద్దమండ్యం మండలం పాపేపల్లెకు చెందిన పప్పు శెట్టి నరసింహులు, కుమారి దంపతుల కుమార్తె పి. గీతాకు మూడేళ్ల క్రితం వివాహమైంది. వివాహం అనంతరం దంపతులు చెన్నైలో కాపురం ఉంటున్నారు. వీరికి 11 నెలల కుమారుడు సంతానం. ప్రకాష్ ఒక ట్రాన్స్‌పోర్టు కంపెనీలో పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఆమె కుటుంబ కలహాలతో శనివారం చెన్నైలోని ఇంటిలో ఉరేసుకొని మృతిచెందింది. కిటికీలో నుంచి గమనించిన భర్త తలుపులు పగలగొటి లోపలికి వెళ్లడంతో అప్పటికే మృతి చెందింది. మృతికి కారణాలు తెలియాల్సి ఉంది. ఆమె మృతదేహాన్ని ఆదివారం స్వగ్రామానికి తీసుకువచ్చారు.

బైకులు ఢీకొని ముగ్గురికి గాయాలు


తీవ్రంగా గాయపడిన శంకర


గాయపడిన కళ్యాణ్

బి.కొత్తకోట : స్థానిక బీరంగి రోడ్డులో ఆదివారం సాయంత్రం ఒక బైక్‌ను మరో బైక్ ఢీకొనడంతో ముగ్గురు గాయపడ్డారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరిని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు ఏఎస్ఐ బొజ్జినాయక్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు. పెద్దతిప్పసముద్రం మండలం ముంతగోకులపల్లెకు చెందిన చాకల శంకర (40) ఆదివారం సంతలో వ్యాపారం చూసుకొని తిరిగి ఇంటికి వెళ్తూ పెట్రోలు బంకులో పెట్రోల్ పోయించుకుని రోడ్డుపైకి వస్తుండగా, బీరంగి వైపు నుంచి బి.కొత్తకోటకు బైక్‌పై వస్తున్న సుదర్శన్ (23), గణేష్ (20), కళ్యాణ్ (19)లు శంకర బైక్‌ను ఢీకొన్నారు. దీంతో శంకర తలపై, సుదర్శన్‌కు గడ్డంపై తీవ్ర గాయాలయ్యాయి. కళ్యాణ్‌కు తల, భుజం, నుదిటిపై గాయాలు కాగా గణేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. సుదర్శన్, శంకరలకు మెరుగైన వైద్యం కోసం మదనపల్లెకు తరలించినట్టు ఏఎస్ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

యువతిని కాపాడిన రైల్వే పోలీసులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరానికి చెందిన ఓ యువతి కడప రైల్వేస్టేషన్‌లో ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించగా రైల్వే పోలీసులు కాపాడారు. బాధితురాలు ఇంటిలో గొడవపడి రైల్వేస్టేషన్‌కు చేరుకుని ప్లాట్‌ఫాంపై దిగులుగా కూర్చొని ఉండగా ఆర్‌పీఎఫ్ హెచ్‌సీ ప్రభాకర్‌రెడ్డి, మహిళా కానిస్టేబుల్ సునీత బాధితురాలితో మాట్లాడారు. కౌన్సెలింగ్ ఇచ్చి ఆమె మేనమామకు అప్పగించారు.

• కోదండరాముడి ఊరేగింపు

ఒంటిమిట్ట : ఆంధ్ర భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి దేవాలయంలో శనివారం విజయదశమి సందర్భంగా బాలాలయంలో విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఉత్సవ మూర్తులకు పట్టు వస్త్రాలు ధరింపజేసి పుష్పమాలతో సుందరంగా అలంకరించారు. అనంతరం ఉత్సవ మూర్తులను ఒంటిమిట్ట పురవీధులలో ఊరేగించగా కోదండరాముడు భక్తులకు అభయమిచ్చారు.


ఒంటిమిట్ట కోదండరామస్వామిని పురవీధులలో ఊరేగిస్తున్న దృశ్యం

జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలి


మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు రామానాయుడు

రాయచోటి అర్బన్ : అన్నమయ్య జిల్లా సమగ్రాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేయాలని సీపీఐ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు రామానాయుడు, అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి పీఎల్ నరసింహులు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో రాయచోటి, పీలేరు నియోజకవర్గాల సీపీఐ నేతలు, కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హంద్రీ–నీవా, గాలేరు–నగరి నీటి ప్రాజెక్టులకు అవసరమైన నిధులు ఏడు దశాబ్దాలుగా కేటాయించకపోవడంతో జిల్లాలో నీటి సమస్య పరిష్కారం కాలేదన్నారు. కడప – బెంగళూరు రైల్వేలైన్ పూర్తికి కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కేటాయించి రవాణా సౌకర్యం మెరుగు పరిచేలా జిల్లా ప్రజాప్రతినిధులు కృషి చేయాలని కోరారు. తెగిపోయిన అన్నమయ్య డ్యాం నిర్మాణానికి యుద్ధప్రాతిపదికన నిధుల విడుదల, పనులు పూర్తికి చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో మూతపడిన పరిశ్రమలను తెరిపించడంతోపాటు నూతన పరిశ్రమలను ఏర్పాటు చేసి నిరుద్యోగులకు, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మహేష్, కార్యవర్గ సభ్యులు విశ్వనాథనాయక్, సాంబశివ, సుమిత్రమ్మ, సిద్దిగాళ్ళ శ్రీనివాసులు, సుదీర్‌కుమార్, కోటేశ్వరరావు, టీఎల్ వెంకటేష్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి రంగారెడ్డి, ఏఐటీయూసీ, ఏఐఎస్ఎఫ్ నేతలు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజెన్స్ సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న ఏపీ సీనియర్ సిటిజెన్స్ రాష్ట్ర అధ్యక్షుడు నారాయణమూర్తి

మదనపల్లె సిటీ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సీనియర్ సిటిజెన్స్ సమస్యలు పరిష్కరించాలని ఏపీ సీనియర్ సిటిజెన్స్ రాష్ట్ర అధ్యక్షుడు నారాయణమూర్తి కోరారు. ఆదివారం స్థానిక బెంగళూరు రోడ్డులోని జీఆర్‌టీ ఉన్నత పాఠశాలలో ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం నిర్వహించారు. 2007 చట్టాన్ని ప్రభుత్వాలు చిత్తశుద్ధితో అమలు చేయాలన్నారు. రైల్వే రాయితీ పాసులను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఇటీవల వయో వృద్ధులపై దాడులు జరుగుతున్నాయన్నారు. ఇలాంటివి జరగకుండా గట్టి చర్యలు చేపట్టాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్‌ను అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా అధ్యక్షుడు మునిగోపాలకృష్ణ మాట్లాడుతూ ఎవరికైనా సమస్యలు ఎదురైతే వెంటనే ఫిర్యాదు చేయాలని కోరారు. సీనియర్ సిటిజెన్స్ సమస్యలపై డైరెక్టర్ రాజా, కథా రచయిత టి.ఎస్.ఎ.క్రిష్ణమూర్తి 'కనువిప్పు' అనే లఘుచిత్రాన్ని నారాయణమూర్తి ప్రారంభించారు. సీనియర్ సిటిజెన్స్ సంఘానికి ప్రివిలేజ్ కమిటీ సభ్యులు ధనలక్ష్మి రూ.20వేలు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో మదనపల్లె యూనిట్ గౌరవ అధ్యక్షుడు వై.ఎస్.మునిరత్నం, కోశాధికారి ఉస్మాన్‌సాహెబ్, శకుంతమ్మ, జగన్‌మోహన్, గొల్లపూడి తిరుపతిరావు, వెలుగు కన్వీనర్ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అధికారులు వ్యాపారులను బెదిరిస్తే.. ఇంటికే

మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి


విక్రయ కేంద్రం ప్రారంభించి వంట నూనెలు ప్రజలకు అందజేస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటి (జగదాంబసెంటర్) : అధికారులు వ్యాపారస్తులను బెదిరించినా.. లంచం అడిగినా.. నేరుగా ఇంటికి పంపడం జరుగుతుందని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. రాయచోటి పట్టణంలోని గాంధీబజార్‌లో పౌరసరఫరాల శాఖ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వంట నూనెల ప్రత్యేక విక్రయ కేంద్రాలను ఆయన శనివారం ప్రారంభించి వినియోగదారులకు వంట నూనెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు నిత్యావసర వస్తువులు సరసమైన ధరలకు అందించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సన్‌ఫ్లవర్ ఆయిల్ లీటర్ రూ.124, పామ్ ఆయిల్ లీటర్ రూ.110కు విక్రయించడం జరుగుతుందని వివరించారు.

రాణించిన కడప బ్యాట్స్‌మన్


తలపడుతున్న ప్రకాశం, పశ్చిమగోదావరి జట్టు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అంతర్ జిల్లాల అండర్–14 మల్టీడేస్ క్రికెట్ పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. టోర్నీలో భాగంగా కేఎస్ఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో ఆదివారం కడప, కర్నూలు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన కర్నూలు జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు 90 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 346 పరుగులు చేసింది. జట్టులోని తాహీర్ 66 పరుగులు చేయగా, సాయికృష్ణ చైతన్య 134 పరుగులతో క్రీజులో నిలిచాడు. కర్నూలు బౌలర్లు వివేక్ 3, హరిహరణ్ 2 వికెట్లు తీశారు. దీంతో తొలిరోజు ఆట ముగిసింది.

రాజారెడ్డి స్టేడియంలో..

వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ క్రికెట్ మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో ప్రకాశం, పశ్చిమగోదావరి జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన పశ్చిమగోదావరి జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. 90 ఓవర్లలో పశ్చిమగోదావరి జట్టు 7 వికెట్ల నష్టానికి 224 పరుగులు చేసి డిక్లేర్ చేసింది. జట్టులోని పి. నారాయణ 71 పరుగులు, జితేష్‌సాయిరెడ్డి 74 పరుగులు చేశారు. ప్రకాశం బౌలర్లు లోకేష్ 3, లతీఫ్ 2 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ప్రకాశం జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 8 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 24 పరుగులు చేసింది. జట్టులోని చరణ్ 12 పరుగులతో క్రీజులో ఉన్నాడు. దీంతో తొలిరోజు ఆట ముగిసే సమయానికి ప్రకాశం జట్టు 200 పరుగుల తేడాతో వెనుకంజలో ఉంది.

కేఓఆర్ఎం మైదానంలో..

కేఓఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో చిత్తూరు, తూర్పుగోదావరి జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన తూర్పుగోదావరి జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. 63.5 ఓవర్లలో 205 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని కార్తీక్ 44, రాజ్ ఆర్యన్ 39 పరుగులు చేశారు. చిత్తూరు బౌలర్లు తేజేష్ 4, దినేష్ 2, ఆశిష్‌రెడ్డి 2 వికెట్లు చొప్పున తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 37 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 118 పరుగులు చేసింది. జట్టులోని సాయిచరణ్ 40 పరుగులు చేశాడు. తూర్పుగోదావరి బౌలర్లు కార్తీక్ 2, తమన్ 2, శేఖర్ 2 వికెట్లు తీశారు. దీంతో తొలిరోజు ఆట ముగిసే సమయానికి 87 పరుగుల తేడాతో చిత్తూరు జట్టు వెనుకంజలో ఉంది.


134 పరుగులు చేసిన కడప బ్యాట్స్‌మన్ సాయికృష్ణ చైతన్య


4 వికెట్లు తీసిన చిత్తూరు బౌలర్ తేజేష్

లారీ ఢీ కొని వృద్ధుడికి తీవ్ర గాయాలు


గాయపడిన బాషా సాహెబ్

ములకలచెరువు : లారీ ఢీ కొనడంతో వృద్ధుడికి తీవ్ర గాయాలైన సంఘటన మండలం కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. కదిరి రోడ్డుకు చెందిన ఎస్. బాషాసాహెబ్(70) పని మీద బస్టాండ్‌లోకి వచ్చాడు. అనంతరం ఇంటికి తిరిగి వెళ్తుండగా కదిరి వైపు నుంచి వస్తున్న లారీ బాషాసాహెబ్‌ను ఢీ కొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వృద్ధుడిని 108 సహాయంతో మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు లారీ స్వాధీనం చేసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డివైడర్‌ను ఢీకొని..


గాయపడిన కిశోర్

కురబలకోట : డివైడర్‌ను ఢీకొనడంతో ఓ యువకుడు తీవ్రంగా గాయపడిన సంఘటన కురబలకోట మండలంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. బాధితుడి కుటుంబీకులు, పోలీసుల కథనం మేరకు..మదనపల్లె పట్టణం శేషప్పతోటకు చెందిన కిశోర్ (32) బుల్లెట్‌లో శనివారం వ్యక్తిగత పనిపై హార్సిలీహిల్స్ వెళ్లారు. తిరిగి వస్తుండగా రాత్రి వేళ విశ్వం కళాశాల సమీపంలో హైవే పై ప్రమాదవశాత్తు డివైడర్‌ను ఢీకొట్టాడు. దీంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. హుటాహుటిన మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం బెంగళూరు ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జాతీయ రహదారిపై గుంతలు పూడ్చివేత


బోయనపల్లెలో హైవేపై ఉన్న గుంతలను పూడ్చుతున్న కార్మికులు

రాజంపేట : కడప–రేణిగుంట జాతీయ రహదారిలోని బోయనపల్లె వద్ద గుంతలు పూడ్చే పనిని ఎన్‌హెచ్‌ఏ అధికారులు చేపట్టారు. ఈ నెల10న సాక్షిలో ప్రచురితమైన 'రహదారి మధ్యలో గుంత పాతఫ్రిజ్‌తో తీరిన చింత' కథనంపై వారు స్పందించారు. దీంతో ఎన్‌హెచ్‌ఏ అధికారులు ఆదివారం గుంతను కాంక్రీట్‌తో పూడ్చేశారు. ఎట్టకేలకు పాతఫ్రిజ్‌ను తొలగించారు. బోయనపల్లె ప్రాంతంలోని హైవేపైకి నీటిని వదలడం వల్లనే గుంతలు పడుతున్నాయని స్థానికులు వాపోతున్నారు.

మేఘాలలో తేలిపోతూ!

బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై శనివారం సాయంత్రం నుంచి రాత్రంతా ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొనగా సందర్శకులు ఆస్వాదించారు. దట్టమైన మేఘాలు కమ్మేయడంతో చల్లటి వాతావరణంలో కొండపై సంచరిస్తున్న సందర్శకులు ఒక్కసారిగా మేఘాల్లో తేలిపోతున్న అనుభూతిని పొందారు. మేఘాలతోపాటే చిరుజల్లులు కురవడంతో సందర్శకులు సందడి చేశారు. వారాంతం కావడంతో సందర్శకులు అధిక సంఖ్యలో కొండపై విడిదికి వచ్చారు.

–బి.కొత్తకోట


హార్సిలీహిల్స్‌ను కమ్మేసిన మేఘాలు